పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

నర్మదానగర్(విస్సన్నపేట): పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని వేమిరెడ్డిపల్లి సచివాలయం పరిధిలో ఆదివారం నర్మదానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి బ్రోచర్లు అందజేశారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నాడు -నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దుతూ మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. రైతు శ్రేయస్సు కోసం ఆర్‌బీకేలు ఏర్పాటు, వారికి సూచనలు, ఎరువులు, ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ పంతంగి విజయకుమారి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, ఎంపీటీసీ వి.సత్యనారాయణచారి, సొసైటీ అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ, గ్రామ ప్రముఖులు నెక్కళపు సుబ్బారావు, నెక్కళపు శివయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు సూరా వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ మండల బీసీసెల్ అధ్యక్షుడు పంతంగి రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

‘విద్యుత్ శక్తి’ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి జోగి రమేష్, నాయకులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లోని విద్యుత్ శక్తి ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ న్యూ ఇయర్ క్యాలెండర్‌ను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదివారం యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నారబోయిన శ్రీనివాసరావు, కార్యదర్శి సిద్ధేశ్వరరావు, నాయకులు వీరబాబు, వెంకటరావు, కృష్ణారావు, నాగమల్లేశ్వరరావు, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం



కృష్ణా డిప్యూటీ కలెక్టర్ శివనారాయణరెడ్డిని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

మైలవరం: స్థానిక బాపూజీ పాఠశాల, వీవీఆర్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కళాశాల పూర్వ విద్యార్థి, కృష్ణా జిల్లా డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం శ్రీబాపూజీ హైస్కూల్, వీవీఆర్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల(మోస్ట్) కార్యాలయాన్ని ఆదివారం శివనారాయణరెడ్డి సందర్శించారు. వీవీఆర్ జూనియర్ కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఎన్నో ఉన్నత పదవుల్లో ఉన్నారని చెప్పారు. ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన గ్రామాన్ని, చదువుకున్న పాఠశాలను మరవకూడదన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు కార్యదర్శి జూల కంటి ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మన్నె శ్రీనివాస్ శివనారాయణరెడ్డికి చిరుసత్కారం చేశారు.

ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి



ఉచిత వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న గ్రామస్తులు

మైలవరం: రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఆరోగ్య శిబిరం సేవలను స్థానికులు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. మైలవరం నారాయణ స్కూల్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విజయవాడ భవానీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, మణిపాల్ ఆస్పత్రుల్లోని ప్రముఖ వైద్యులు పాల్గొనడం గొప్ప విషయమన్నారు. కార్యదర్శి, కోశాధికారి గూడూరు నాగిరెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి స్త్రీలలో వచ్చే రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లపై అవగాహన కల్పించడం ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమని చెప్పారు. శిబిరంలో మెంటార్ వజ్జల బాలాజీ ప్రసాద్, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో 1981-82 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు



పెనుగొలను హైస్కూలులో కలసిన పూర్వ విద్యార్థులు

నూజివీడు : ఆగిరిపల్లి హైస్కూల్‌లో 1981-82 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం హైస్కూల్లో నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి 60మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అవసరంలో ఉన్న మిత్రులకు సాయపడాలని, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు సభ్యులందరూ నిధిని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని నిర్ణయం తీసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని, కుటుంబ విషయాలు తెలుసుకున్నారు. ఏటా ఇలాంటి సమ్మేళనాన్ని నిర్వహించుకోవాలని కమిటీని ఏర్పాటు చేసుకున్నారు.

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-95 సంవత్సరాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ బాల్యంలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి గురువులు ప్రభాకర్, రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రంకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు పి. శ్రీనివాసరావు, ఎస్.వెంకటేశ్వర్లు, రఘురాం, రమణయ్య, ఎస్.స్వప్న ప్రియలు, పీఎంసీ చైర్మన్ ముక్కంటి పాల్గొన్నారు.

నేడు అడవినెక్కలంలో గడప గడపకు మన ప్రభుత్వం

ఆగిరిపల్లి: మండలంలోని అడవినెక్కలంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు.

నూతన దంపతులకు ఆశీస్సులు



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు : వారిద్దరూ తల్లిదండ్రులను కోల్పోయి చిన్నతనం నుంచి అనాథ ఆశ్రమంలో పెరిగిన వారే. వారిద్దరూ వివాహం చేసుకొని ఒక్కటయ్యారు. ఈ వేడుకకు పట్టణంలోని స్నేహారైడ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన అనాథల వసతి గృహం వేదికైంది. స్నేహారైడ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ బసవరాజు నగేష్, అన్నపూర్ణ దంపతులు ఈ వివాహాన్ని జరిపించారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి స్నేహారైడ్స్ అనాథ పిల్లల వసతి గృహంలో పెరిగిన కళ్యాణికి, విజయవాడ దుర్గాపురంలోని సుందర్‌నగర్ కాలనీకి చెందిన యువకుడు సువర్ణరాజుతో వివాహం చేశారు. వీరిద్దరిని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బసవరాజు నగేష్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి



తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తీగెల ఆంజనేయులు, గ్రంథాలయాధికారి పద్మావతి తదితరులు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు స్పందన

నూజివీడు : ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రజలు అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు.

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎ.కొండూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముసునూరు : మండల రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దాసరి సుధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి ప్రారంభం కానున్న స్పందన కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యలను, వినతులను, అర్జీల రూపంలో సంబంధిత కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.

కళ్లాల్లో ధాన్యం బస్తాలు మాయంపై కేసు

కంచికచర్ల: గుర్తు తెలియని వ్యక్తులు కళ్లాల్లోని ధాన్యం బస్తాలను దొంగిలించడంతో రైతు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శౌరి అమరవరం గ్రామానికి చెందిన రైతు సుబ్బారావు తన పొలంలో పండించిన ధాన్యాన్ని డిసెంబర్ 27వ తేదీన కళ్లంలో ఆరబెట్టి బస్తాల్లో నింపాడు. రాత్రి పొద్దుపోవడంతో తెల్లవారుజామున ఇంటికి తరలిస్తాననుకుని కళ్లంలోనే 24 బస్తాలను వదలి ఇంటికి వెళ్లాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఆ ధాన్యపు బస్తాలను అపహరించుకుపోయారు. చుట్టుపక్కల వెదికినా ఎటువంటి సమాచారం అందలేదు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇండియన్ స్ప్రింగ్స్‌లో రంగవల్లుల పోటీలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో సంక్రాంతి పండగ సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. 120 మంది మహిళలు వివిధ రకాల ముగ్గులు తీర్చిదిద్దారు. విద్యార్థుల కోలాహలం మధ్య గంగిరెద్దుల ఆటలు, హరిదాసు కీర్తనలు, భోగి మంటలు వేశారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీస్సులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చాటిన ముగ్గురు మహిళలకు బహుమతులు అందజేశారు. పాఠశాల జాయింట్ సెక్రటరీ కొమ్మారెడ్డి చైతన్య, ప్రిన్సిపాల్ వాణీకుమారి, వైస్ ప్రిన్సిపాల్ నాగరత్నం, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడు

విజయవాడ కల్చరల్: భారతీయుల ప్రత్యక్షదైవం సూర్యభగవానుడని యువ ఆధ్యాత్మికవేత్త గరికపాటి గురజాడ పేర్కొన్నారు. శృంగేరీ శారద పీఠం ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించే సాహిత్యంలో సూర్యభగవానుడు ఆధ్యాత్మిక ప్రసంగాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గరికపాటి గురజాడ మాట్లాడుతూ రామయణం, భారతం, అష్టాదశ పురాణాల్లో సూర్యుని ప్రస్తావన కనిపిస్తుందన్నారు. ప్రాచీన కవులు తమ కావ్యాలలో సూర్యోదయం. సూర్యాస్తమయం వర్ణన కనిపిస్తుందన్నారు. సూర్యధ్యానం వల్లనే పాండవులకు అక్షయ పాత్ర లభించిందని పేర్కొన్నారు. ఆదిత్య హృదయం పఠిస్తే రామాయణంలో శ్రీ రామచంద్రునికి విజయం లభించిందన్నారు. కవుల కవితా వస్తువు సూర్యభగవానుడుగా భావించవచ్చన్నారు. సూర్యుని ద్వారా ప్రసారమయ్యే కిరణాల ద్వారా కొన్ని రకాలైన దీర్ఘవ్యాధులు నయం అవుతాయని సైన్స్ చెబుతోందన్నారు. భారత దేశంలో అనేక సూర్యదేవాలయాలున్నాయన్నారు. సూర్యమానం అనుసరించి సంక్రాంతి పండగను తెలుగు వారు జరుపుకుంటారని తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ గరికపాటి గురజాడ విశేషాలను వివరించారు. గరిపాటి నరసింహారావు వారసుడిగా అనేక ఆధ్యాత్మిక ప్రసంగాలను చేసి, యువతను ధర్మమార్గం వైపు నడిపిస్తునట్లు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఆలయ ప్రాంగణంలో సూర్యభగవానుడికి పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. ఆలయ ప్రాంగణంలో లక్ష కుంకుమార్చన వేదిక వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. లోక సంరక్షణార్థం సూర్యోపాసన సేవ చేస్తున్నారు.

తీరనున్న తాగునీటి కష్టాలు



కిలేశపురంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ఆ స్థలంలో జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

మండలం	గ్రామం/వార్డులు	నిధులు(లక్షల్లో)	చేపట్టే పనులు
మైలవరం	13	రూ.1567.59	38
రెడ్డిగూడెం	11	రూ.1201.84	43
జికొండూరు	22	రూ.1680.40	46
ఇబ్రహీంపట్నం	10	రూ.1445.20	45
విజయవాడ రూరల్	5	రూ.1509.70	31
కొండపల్లి మున్సిపాల్టీ	29	రూ.5793.00	---

- జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ కుళాయిలు
- నియోజకవర్గానికి రూ.74.04 కోట్లు మంజూరు
- కొండపల్లి మున్సిపాల్టీకి రూ.57.93 కోట్లు

ఇబ్రహీంపట్నం: ఏ పల్లెలోనూ ప్రజలు ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఇంటింటి కుళాయి పథకం కార్యరూపం దాల్చనుంది. దీంతో ప్రజలు తాగునీటి కష్టాలు తొలగనున్నాయి. మైలవరం నియోజకవర్గంలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు అవసరమైన నిధులు జలజీవన్ మిషన్ పథకంలో రూ.74.04కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఐదు మండలాల్లో 62 గ్రామాల ప్రజల నీటి ఇక్కట్లు తొలగనున్నాయి. మైలవరం నియోజక వర్గంతో పాటు కొండపల్లి మున్సిపాల్టీలో ఇంటింటి కుళాయి పథకానికి రూ.57.93 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి.

ఈ పథకంతో ప్రజల రోజువారీ సాధారణ, తాగునీటి అవసరాలు తీరతాయి. గ్రామీణ నీటిపారుదల శాఖ, పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.


నియోజకవర్గంలో తొలగనున్న నీటి సమస్యలు

నియోజకవర్గంలో జలజీవన్ మొదటి, రెండోదశ పనులకు నిధులు మంజూరు చేస్తూ ఆయా శాఖలకు ఉత్తర్వులు అందాయి. దీంతో మైలవరం, రెడ్డిగూడెం, జికొండూరు, విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలోని 62 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు కుళాయిలు ప్రతి ఇంటికి ఏర్పాటు చేస్తారు. నిధులతో గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపులు, పైప్‌లైన్ వంటి 203 రకాల పనులు చేపట్టేందుకు స్థలాల అన్వేషణ చేపట్టారు.

కొండపల్లిలో..

ఉమ్మడి కృష్ణా జిల్లాలో మేజర్ పంచాయతీగా ఉన్న కొండపల్లిని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కృషితో మున్సిపాల్టీగా అవతరించింది. ఈ ప్రాంతంలో ఇంటింటికీ కుళాయి పథకానికి అవసరమైన రూ.57.93 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ ఉన్నతాధికారులు పరిధిలో టెండర్ల దశలో ఉంది. ఒక వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, రెండు ఎలివేషన్ స్టోరేజ్ రిజర్వాయర్లు, పైప్‌లైన్ ఏర్పాటు చేస్తారు.

ఆనందంగా ఉంది



జూపూడి గ్రామంలో ఇప్పటి వరకు గ్రామీణ రక్షిత తాగునీటి సరఫరా పథకం ద్వారా నీరు సరఫరా అవుతోంది. కుళాయిల నుంచి గంట పాటు వచ్చే నీరు ప్రజల అవసరాలు తీర్చలేక పోతున్నాయి. నేటికీ బోరు పంపులు, బావుల నుంచి నీటిని తెచ్చుకునే పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఇంటింటి తాగునీటి కుళాయి పథకం మా గ్రామానికి కూడా మంజూరు చేయడం ఆనందంగా ఉంది.

– కాకి దేవమాత, సర్పంచి, జూపూడి

నిధుల మంజూరుతో సంతోషం



రెడ్డిగూడెం మండలంలో ఇంటింటి తాగునీటి కుళాయి వస్తుందని తెలిసి ప్రజలు సంతోషంగా ఉన్నారు. మారుమూల మండలంగా ఉన్న రెడ్డిగూడెం మండలానికి జలజీవన్ మిషన్ ద్వారా రూ.12.01కోట్లు మంజూరు కావడం శుభపరిణామం. సర్పంచిగా నా హయాంలో ఇంటింటి కుళాయి రావడం సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు.

–మల్లాది రాణి, సర్పంచి, రెడ్డిగూడెం

తూనికలు కొలతల అధికారుల దాడి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో తూనికలు, కొలతల అధికారులు మాంసం దుకాణాలపై ఆదివారం ఆకస్మికంగా దాడి చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో పట్టణంలోని మటన్, చికెన్ దుకాణాల్లో కటాలు, రాళ్ల పరిమాణాన్ని తనిఖీ చేశారు. కొండపల్లిలో అనేక దుకాణాలు తనిఖీ చేశామన్నారు. ఎక్కడా కొలతలు, కాటా రాళ్లలో తేడా కనిపించలేదని తెలిపారు. తేడా ఉన్నట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని షాపుల యజమానులను హెచ్చరించారు.

రేపటి నుంచి జగనన్న సంక్రాంతి క్రీడా సంబరాలు

చాట్రాయి : సంక్రాంతి పండగ పురస్కరించుకుని మండల స్థాయిలో జగనన్న సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 9, 10 తేదీల్లో చిత్తపూరు హైస్కూల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నామని, ఆసక్తి గల క్రీడాకారులు సోమవారం మధ్యాహ్నం లోపు చాట్రాయి, పోలవరం చిన్నంపేట హైస్కూలు పీఈటీల వద్ద నమోదు చేసుకోవాలని ఆయన చెప్పారు. క్రీడాకారులు ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ముత్యాల హారతి



గంపలగూడెం భజన మందిరంలో శ్రీకృష్ణపరమాత్ముడికి విశేష పూజ

గంపలగూడెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయం, భజన మందిరం, గోసవీడు మదనవేణుగోపాలస్వామి ఆలయాల్లో భక్తులు శ్రీకృష్ణ పరమాత్మకు ముత్యాల హారతి జరిపారు. మహిళలు ప్లేట్లలో ముత్యాల దండలు, ప్రమిదలు ఉంచి దీపాలు వెలిగించారు. 14 మందికి దాత సహకారంతో బహుమతులు అందజేశారు.

పెనుగొలనులో అమ్మవారికి సారె

పెనుగొలను రామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళల అమ్మవారికి సారె సమర్పించారు. ముందుగా సారె సామగ్రితో మహిళలు గ్రామోత్సవం చేశారు. నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, పెద్దకొమిర వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా చేశారు.

నేడు సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తిరువూరు: పట్టణంలో రూ.60 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే రక్షణనిధి సోమవారం ప్రారంభిస్తారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులకు పట్టణంలోని 3 సచివాలయాల పరిధిలో నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే రహదారుల పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

నేడు జ్యోతిరావ్ పూలే విగ్రహావిష్కరణ

ఇబ్రహీంపట్నం: మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమం విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 17వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఎన్టీటీపీఎస్ పాతగేటు వద్ద సోమవారం జరుగుతుందని ఆసంఘం బ్రాంచి అధ్యక్షుడు సీహెచ్ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని విగ్రహం ఆవిష్కరిస్తారు. అనంతరం యూనియన్ రాష్ట్ర మహాసభ జరుగుతుంది.

నిత్య సహాయమాత మహోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో నిర్వాహకులు

జగన్నాథపురం(వీరులపాడు): మండలంలోని జగన్నాథపురంలో జనవరి 15,16,17 తేదీల్లో నిత్య సహాయమాత మహోత్సవాల్లో భాగంగా దివ్య బలిపూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారని రె.ఫా జోసఫ్ సుగుణరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆదివారం గ్రామంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వాసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

నూజివీడు: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూజివీడు కార్యవర్గం ఎన్నిక ఆదివారం పట్టణంలో నిర్వహించారు. దీనిలో భాగంగా యూనియన్ అధ్యక్షురాలిగా వై.ఆదిలక్ష్మి, కార్యదర్శిగా పి.రాజకుమారి, కోశాధికారిగా కందుల శోభతో పాటు మరో 20 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి. రాజు తెలిపారు.

శ్రీదేవి కరుమారి అమ్మన్‌కు పుష్పయాగం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పుష్యమాసం, పుష్యమి నక్షత్రం, శ్రీదేవి కరుమారి అమ్మన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సైనవరం ఫ్లై ఓవర్ సమీపంలోని శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో ఆదివారం మహా పుష్పయాగం జరిగింది. అమ్మవారికి వివిధ ఉత్తమ జాతి పుష్పాలను అభిషేకానికి వినియోగించారు. పుష్పయాగానికి వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య ప్రముఖులు కొండపల్లి మురళీకృష్ణ(బుజ్జి) విచ్చేశారు. తొలుత ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు పీఠాధిపతి కరుమారి దాసు, ఆలయ కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల అనంతరం ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. అమ్మవారికి, ఉత్సవ మూర్తులకు సుమారు ఐదు వందల కేజీల పుష్పాలను అభిషేకానికి వినియోగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రాయప్రోలు దీక్షిత్, ఎస్.జ్ఞానేష్, వై.వెంకట నాగేందర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.